

బహుమతి పొందిన చిట్టికథ

# "ఆచరణలోకి వస్తే"

-పి. హిమజాదేవి

సంఘమిత్రా కో ఎడ్యుకేషన్ కాలేజి క్యాంపస్ ఆ సాయంత్రం రంగు రంగుల కాగితాలతో అలంకరించబడింది. అమ్మాయిలు, అబ్బాయిలూ అందమైన బట్టల్లో జీవితంలోని స్వేచ్ఛ, సంతోషాలన్నీ కాలేజీ చదువులోనే అన్నట్లు ఉత్సాహంగా ఆ రోజు కాలేజీ వార్షికోత్సవాన్ని జరుపుతున్నారు.

సంఘమిత్ర కాలేజీ వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా ప్రఖ్యాత నవలా రచయిత్రి మాలినీ దేవిని ఆహ్వానించారు. మిగతా వక్తలుగా నగరంలో ప్రముఖులైన వాళ్ళను ఆహ్వానించారు.

అప్పటికే కాస్త ఆలస్యమైనా సభ ఇంకా ఆరంభం కాలేదు. అందుకు కారణం ముఖ్య అతిథిగా పిలిచిన మాలినీదేవి ఇంకారాలేదు. వార్షికోత్సవ ఆహ్వాన సంఘం ఈ విషయం గురించి ఆందోళన పడుతున్నారు. వారి ఆందోళన పెరగకముందే పెద్ద అలజడి మొదలైంది. కారణం ఆంధ్ర పాఠక హృదయాలలో చెరగని ముద్రవేసుకున్న ప్రఖ్యాత నవలా రచయిత్రి మాలినీ దేవి తన బుల్లి మారుతీ కారులో కాలేజీ క్యాంపస్‌లోకి ప్రవేశించింది.

కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ తమ అభిమాన రచయిత్రి చుట్టూ మూగి ఆటోగ్రాఫ్‌లకై ఎగబడసాగారు.

కాలేజీ సిబ్బందికి ఈ వ్యవహారం పెద్ద ఇబ్బంది అయింది. ఎలాగో స్టూడెంట్స్‌ని వారించి మాలినీ దేవిని వేదిక మీదకు అతికష్టం మీద తీసుకురాగలిగారు.

కొద్దిగా నెరిసిన జుట్టుకి రంగువేసుకుని మెడలో పదికాసుల బంగారం వేసుకుని రెండువేల రూపాయిల పట్టు చీరలో గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడును సవరించుకుని వేదిక మీద ఆసీనురాలైంది రచయిత్రి మాలినీ దేవి.

వివిధ రకాలైన పోటీలలోగెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు మాలినీదేవి చేతి మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. అందరికంటే ఎక్కువ బహుమతులు తన చేతిమీదుగా అందుకున్న అందమయిన అమ్మాయి షకీల మాలినీ దేవి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ప్రసంగించారు. వారి ప్రసంగం చాలా సాధారణంగా చప్పగా ముగిసింది.

ఆ తర్వాత ముఖ్య అతిథి మాలినీ దేవి ప్రసంగం మొదలు పెట్టింది. తన కథల దగ్గరనుంచి సీరియల్స్‌లోని తమాషాల మీదుగా రాయబోయే నవలల థాట్స్ వరకూ ఏకబిగిన ప్రసంగించి అందరినీ తన వాగ్ధాటితో మంత్రముగ్ధుల్ని చేసింది. తర్వాత విద్యార్థినీ విద్యార్థులు పరస్పరం అవగాహన చేసుకుని నేటి సమాజాన్ని మార్చడానికి కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవాలని ఎవరయినా ధైర్యంగా ముందుకి వచ్చి అందరి ముందటా తమ ప్రేమ విషయాన్ని తెలియజేస్తే పెద్దలమైన మేము వారికి అండగా నిలబడి వారి పెళ్ళి చేయించి చేతనైనంత సహాయం చేసి ఆదుకుంటామని తన అభ్యుదయ భావాల సారాంశాన్ని తెలియజేసింది. అందరూ అభ్యుదయ రచయిత్రి మాలినీదేవి ఆదర్శవంతమైన ప్రసంగానికి హర్షామోదాలను చప్పట్ల రూపంలో తెలియజేశారు. ఆ తర్వాత కాలేజీ విషయాల గురించి, అభ్యుదయ వివాహాల గురించి ఇద్దరు లెక్చరర్స్ ప్రసంగించారు.

కాలేజీ పోటీలలో ఎన్నో బహుమతులు పొందిన కుమారి షకీల మాట్లాడటానికి మైకు దగ్గరకు వచ్చింది. మాలినీ దేవి షకీలవైపు మెచ్చుకోలుగా చూసింది. షకీల సభకు వందనాలు తెలియజేస్తూ ప్రసంగం ఆరంభించింది.

"ఇంతవరకూ వచ్చాక తెలియచేయకపోవడం బాగుండదు. అదీ మాలినీదేవిగారి అభ్యుదయ భావాలకు ప్రతీక అయిన ఆమె కొడుకు విష్ణు వర్ధన్‌గారూ నేనూ ప్రేమించుకున్నాం. త్వరలోనే మీ అందరి ఆశీస్సులతో మాలినీ దేవిగారి ఆదర్శానికి నిదర్శనంగా మతాంతర వివాహం చేసుకోబోతున్నాం. ఈ విషయం ఈ సభాముఖంగా తెలియచేయడానికి ధైర్యాన్నిచ్చిన మాలినీ దేవిగారికి నా నమస్సుమాంజలులు..." అంటూ ప్రసంగిస్తున్న షకీల ప్రసంగం పూర్తికాకమును పే రచయిత్రి మాలినీ దేవి విరుచుకు మూర్ఛపడిపోయింది. అందరూ గాభరాపడిపోయి సోడా చల్లి ఆమెను లేపారు.

అంతకు మునుపే ఓ గొప్ప సంబంధం పెద్ద కట్నంతో కొడుక్కి మాట్లాడి ఆ సభకు ఆలస్యంగా వచ్చిందన్న సంగతి ఆమెకు తప్ప మరెవరికీ తెలియదు.

'అభ్యుదయం అందమైన మాటల్లోనేకానీ ఆచరణలోకి వస్తే ఇలాగే మూర్ఛ రావడంఖాయం' అనుకుని కారులో కూలబడి షకీల వైపు గుర్రుమంటూ చూసింది రచయిత్రి మాలినీ దేవి. □